
ప్రజాశక్తి

శుక్రవారం 29 సెప్టెంబర్ 2023

5

పార్వతీపురం మన్యం



నేడు పాలకొండలో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి - పార్వతీపురం

మండల స్థాయిలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమం శుక్ర వారం పాలకొండలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురు వారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాలకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుండి జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఉంటుందని ఆయన చెప్పారు. ప్రజలు తమ అర్జీలను సమర్పించ వచ్చని తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం అక్టోబరు 4న జియ్యమ్మవలస, 6న వీరఘట్టం, 11న కురుపాం, 13న సీతంపేట, 18న సాలూరు, 20న పాచిపెంట, 25న భామిని, 27న గుమ్మలక్ష్మీపురం మండలాల్లో జరుగుతుందని ఆయన చెప్పారు.



కళావతికి కష్టకాలం

- అనుకూలంగా మలుచుకుంటున్న సుజన
- అండగా నిలుస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్ ?
- అధికార పార్టీలో వేడెక్కిన రాజకీయం

పాలకొండ ఎమ్మెల్యే విశ్వసరాయ కళావతికి కష్టకాలం మొదలైంది. కొన్నాళ్లుగా ఆమె చుట్టూ నెలకున్న అసమ్మతిసెగ మరింతగా అలముకుంటోంది. ఎమ్మెల్యేపై అసంతృప్తి, అసమ్మతిని ఇదే అదునుగా పరిస్థితిని పాముల సుజన తనకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. ఇందుకు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆశీస్సులు కూడా తోడవ్వడంతో పార్టీ తరపున తానే అన్ని సమస్యలూ పరిష్కరిస్తానంటూ సుజన ముందుకు దూసుకెళ్తున్నారు. మరోవైపు సుజన ముద్రించిన కరపత్రాన్ని ఎమ్మెల్యే అనుయాయులు బహిరంగంగా తగల బెట్టడంతో పాలకొండలో అధికార పార్టీ పరిణామాలు తారాస్థాయికి చేరినట్టుగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పాలకొండ ఎమ్మెల్యేగా కళావతి గతంతో రెండుసార్లు సునాయాసంగానే గెలుపొందారు. ఈ సారి ఆ పరిస్థితి తలకిందులుగా మారే పరిస్థితులు కనిపి స్తున్నాయి. ఆమె స్వయం కృపరాధమే ఇందుకు కారణని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయాల ధోరణి పెరిగిందని చర్చ జరుగుతోంది. ఎమ్మెల్సీ విక్రాంత్‌కు, ఆమెకు మధ్య నెలకున్న విభేదాలు కూడా ముదురుపాకాన పడ్డాయి. నియోజకవర్గంలో వ్యతిరేక సర్పంచులు, నాయకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈనేపథ్యంలో స్వపక్షంలో విపక్ష గళాన్ని అంచనా వేయడంలో ఎమ్మెల్యే విఫలమౌతూ వస్తున్నారు. భామిని మండలంలో ఆమె ఏకపక్ష వైఖరి మరోసారి బహిర్గతమై బెడిసికొట్టింది. దీంతో, ఆమె వ్యూహం బెడిసికొట్టి, మరింత తలనొప్పిగానే పరిణమిం చింది. వాస్తవానికి ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయాలపై చాలా రోజులుగా ఈ మండలంలో కొంతమంది నాయకులు కినుక వహిస్తున్నారు. ఇదే కారణంతో కొద్దిరోజుల క్రితం జరిగిన మండల పరిషత్ సమావేశాన్ని వైసిపికి చెందిన మెజార్టీ ఎంపిటిసి సభ్యులు బహిష్కరించారు. కోరం లేక వాయిదా వేయాల్సిన ఆ సమావేశంలో కేవలం నాలుగు పంచాయతీల్లో రూ.1కోటి ఖర్చు చేసేందుకు తీర్మాణం జరిగిపోయింది. ఈ పరిణామం వెనుక ఎమ్మెల్యే కీలకపాత్ర పోషించారంటూ ఎమ్మెల్యే వ్యతిరేక ఎంపిటిసి సభ్యులంతా గుర్రుగా ఉన్నారు. సీతంపేట, పాలకొండల్లో కూడా ఇదే రకమైన వివాదాలు వైసిపి నాయకుల్లో అసంతృప్తి రేపుతున్నాయి. ఈనేపథ్యంలో వైసిపిలో కొన్నాళ్లుగా చురుకుగావుంటున్న పాముల సుజన రాజకీయాలను తనకు అనుకులంగా మలచుకునే పనిలో నిమగ్నమయ్యారు. మొత్తం పాలకొండ నియోకజవర్గంలోని కీలక సమస్యలను ప్రస్తావిస్తూ ఇటీవల ఒక కరపత్రాన్ని ప్రచురించారు. అందులో పేర్కొన్న సమస్యలన్నింటి పరిష్కారానికి కృషిచేస్తానని, ప్రజలు, నాయకులు తనను ఆశీర్వదించాలని అందులో పేర్కొన్నారు. దీంతో, ఎమ్మెల్యేతోపాటు ఆమె అనుయాయులు కంగు తిన్నారు. ఏం చేయాలో అర్థంకాని పరిస్థితుల్లో సుజన ముద్రించిన కరపత్రాన్ని తగలబెడుతూ వ్యతిరేక నినాదాలు కూడా చేశారు. టిడిపి సానుభూతిపరులతో జతకట్టిన సుజన పార్టీని రెండుగా చీలుస్తున్నారంటూ గుర్రుపెడుతు న్నారు. ఎమ్మెల్సీ విక్రాంత్, ఆయన అనుయాయులు సుజనను ప్రోత్సహిస్తున్నారని కూడా ఎమ్మెల్యే గ్రూపు ఆరోపణలు చేస్తోంది. ఈ వరుస పరిణామా లతో నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనుకూల, వ్యతిరేక గ్రూపుల మధ్య విభేదాలు తారా స్థాయికి చేరాయి. పరిస్థితులు ఎలా మారుతాయో వేచిచూడాల్సిందే.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఉద్యమించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఉత్తరాంధ్ర ప్రజలు ఉద్యమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. కొమరాడలో సిపిఎం విస్తృత స్థాయి సమావేశం ఆ పార్టీ నాయకులు హెచ్.రామారావు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశానికి విచ్చేసి రెడ్డి వేణు మాట్లాడుతూ బిజెపి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు రక్షణ లేకుండా పోతుందని అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలకు జీవననాడి అయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకోడానికి సిపిఎం క్షేత్రస్థాయిలో కార్యాచరణలోకి దిగుతుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉక్కు కర్మాగారంపై అనుసరిస్తున్న వైఖరిని అటు పట్టణాల్లోనూ ఇటు గ్రామాల్లోనూ వాడవాడల ప్రజలకు తెలియజేసేందుకు సిద్ధమవుతుందని, తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఇలాంటి సందర్భంలో ముఖ్యంగా ఉత్తరాంధ్ర వాసులు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకే ఇప్పటికే గట్టిగా నిలబడుతూ, నైతికంగా ఉక్కు కార్మికులకు వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు సిపిఎం ఉత్తరాంధ్ర అంతటా బైక్ యాత్రలు ఇప్పటికే చేపట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 20న బైక్ యాత్ర ప్రారంభమైందని, అక్టోబర్ 5న కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద భారీ బహిరంగ సభ జరుగుతుందని అన్నారు. ఈ సభకు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని తక్షణమే ఆపాలని, సొంత గనులు కేటాయించాలని, నిర్వాసితులకు పూర్తిస్థాయిలో ఉద్యోగాలిచ్చి ప్లాంట్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్లాంట్ నిర్వహణకు రూ.5వేల కోట్లు నిధులు ఇవ్వాలన్నారు. మండలంలోని ప్రధానమైన సమస్య పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణమని, ఇందు కోసం సిపిఎం పోరాడుతుందన్నారు. అలాగే ఏనుగుల సమస్య కూడా పరిష్కరించాలన్నారు. గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యాలు, పోడు భూములకు పట్టాలు అందే వరకూ పోరాడుతుందన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వాకాడ ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, నాయకులు వెంకటేష్, సత్యం, రామారావు, కామయ్య, మధు, దాలయ్య, గోపాల్, అరుణ తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్‌కు నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

భగత్ సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

భగత్ సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. కొమరాడలో గురువారం భగత్ సింగ్ 116వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. భగత్ సింగ్ స్ఫూర్తితో యువత పెద్దఎత్తున తమ హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పాలకొండ

11 కెవి వీరఘట్టం ఫీడర్ నిర్వహణ పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అధికారి బయ్యంనాయుడు, ఎఇఇ శ్యామసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల గోపాలపురం, మంగళాపురం, బుక్కురు, తమటాపల్లి, బాసూరు, కోటిపల్లి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. కావున వినియోగదారులు ఈ అసౌకర్యానికి సహకరించాలని కోరారు.



సభలో మాట్లాడుతున్న అధ్యాపకులు రామయ్య

దళితుల వ్యధకు దర్పణం జాషువా రచనలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సమాజంలోని వేళ్లూనుకున్న కుల వివక్ష, అంధ విశ్వాసాల ఫలితంగా దళితులు అనుభవించిన దుర్భర పరిస్థితులకు అద్దం పట్టిన గుర్రం జాషువా రచనల అవసరం ఈరోజుకు కూడా ఉందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉపన్యాసకులు దేవరాపల్లి రామయ్య అన్నారు. గురువారం స్థానిక వేదాంత జూనియర్ కళాశాలలో స్నేహకళా సాహితి నిర్వహించిన గుర్రం జాషువా జయంతి సభలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఈ సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ రచయిత మల్లిపురం జగదీశ్ మాట్లాడుతూ గుర్రం జాషువా రచనలు ఈ సమాజాన్ని అభ్యుదయ మార్గంలో నడిపించిన కారణంగానే ఈరోజు దళితులు, గిరిజనుల జీవితాల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళీమోహనరావు మాట్లాడుతూ జాషువా సాహిత్యాన్ని నేటి విద్యార్థుల మనసులకు హత్తుకునేలా చేరవేయాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో స్నేహ కళా సాహితి వ్యవస్థాపకులు గంటేడ గౌరునాయుడు, చందనపల్లి గోపాలరావు, సిరికి స్వామినాయుడు,పక్కి రవీంద్రనాథ్,చింత అప్పలనాయుడు, కిమ్మి నవీన్, సి. హెచ్. సత్యనారాయణ, గంటేడ చిన్నంనాయుడు, సోమేశ్వరరావు, ఉత్తరావల్లి గోవిందరావు, దొడ్లంకి గణపతిరావు తదితరులు ప్రసంగించారు.

స్తంభించిన పాలన

సబ్‌కలెక్టర్ బదిలీతో ఖాళీ అయిన కుర్చీ

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ రెవెన్యూ డివిజన్లో పాలన స్తంభించిందని చెప్పొచ్చు. డివిజన్‌కు కీలకమైన అధికారి సీటు ఖాళీగా ఉండడంతో రెవెన్యూ పనులు స్తంభించిపోయాయి. ఈ డివిజన్ పరిధిలో పాలకొండతో పాటు వీరఘట్టం, సీతంపేట, భామిని, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాలు ఉన్నాయి. ఏడు మండలాలను పర్యవేక్షించే రెవెన్యూ అధికారి కొద్ది రోజుల నుంచి లేకపోవడంతో పరిపాలన అస్తవ్యస్తంగా ఉంది. సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ కొద్ది రోజుల క్రితం ఇక్కడ నుంచి బదిలీపై వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగానే ఉంది. ఈ బాధ్యతలను పార్వతీపురం ఆర్‌డిఒకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే ఆమెకు పని ఒత్తిడి కారణంగా అందుబాటులో ఉండలేని పరిస్థితి నెలకొంటోంది.



బోసిపోయిన కార్యాలయం

స్పందన ఏదీ?

ప్రతి సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరగాల్సిన స్పందన కార్యక్రమం గత మూడు వారాల నుండి జరగడం లేదు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు సమస్య వినే అధికారి లేకపోవడంతో ప్రజలు నిరాశతో తిరిగిముఖం పడుతున్నారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకం చేపడుతున్న భూరీసర్వే పై కూడా దృష్టి పెట్టడానికి అధికారులు లేరనే చెప్పాలి. రెండో విడత డివిజన్‌లో 59 గ్రామాల్లో ఈ సర్వే జరుగుతున్నప్పటికీ మందకొడిగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. డివిజన్ స్థాయి అధికారి లేకపోవడం వల్ల ఈ సర్వే అంతంత మాత్రంగానే జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సబ్ కలెక్టరా? ఆర్‌డిఒ

ఎంతో కాలం తర్వాత పాలకొండకు సబ్ కలెక్టర్‌ను నియమించారు. పది నెలల క్రితం ఐఎఎస్ స్థాయి అధికారిని ఇక్కడ సబ్ కలెక్టర్ గా నియమించారు. ఐఎఎస్ అధికారి రావడంతో ప్రజలు కూడా సంతోషించారు. అనతి కాలంలోనే ఆయన బదిలీపై వెళ్లిపోవడంతో మళ్లీ ఐఎఎస్ అధికారిని నియమిస్తారా లేదా ఆర్‌డిఒ స్థాయి అధికారిని నియమిస్తారా అనేది అందరిలో చర్చ జరుగుతుంది. రాజకీయ నాయకులు మాత్రం ఆర్‌డిఒ స్థాయి అధికారిని నియమిస్తారనే ప్రచారం చేస్తుంటే ప్రజలు మాత్రం ఐఎఎస్ స్థాయి అధికారిని నియమించాలని కోరుతున్నారు.



సిబ్బందికి రేబిస్ టీకా వేయించడాన్ని పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాధరావు

రేబిస్ పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి - పార్వతీపురం

రేబిస్ వ్యాధి పట్ల అవగాహన అవసరమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథ రావు అన్నారు. ప్రపంచ రేబిస్ వ్యాధి దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా ఆసుపత్రిలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. కార్మికులకు, కుక్కలను పట్టే వారికి, కుక్క కాటుతో వచ్చిన రోగులకు విఆర్‌వి ఇంజెక్షన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ ప్రజలకు కుక్కకాటు వల్ల వచ్చే రాబీస్ వ్యాధి గురించి అవగాహన ఉండాలని, కుక్క కాటు వేసిన వెంటనే దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అవసరమైన వైద్యం చేయించుకోవాలని ఆయన సూచించారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ వాగ్దేవి మాట్లాడుతూ కుక్క కాటుకు ఎటువంటి నాటు వైద్యం తీసుకోరాదన్నారు. వైద్యం తీసుకోవడంలో అలసత్వం ఉండకూడకూడదని, రాబీస్ వ్యాధి ప్రాణాంతకమని సూచించారు. కార్యక్రమం లో జిల్లా సర్విలియేన్స్ అధికారి డాక్టర్ నవీన్ కుమార్, ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు జివిఆర్‌ఎస్ కిషోర్, యానిమల్ బైట్ క్లినిక్ సభ్యులు పాల్గొన్నారు.

ఏనుగుల బీభత్సం

- ప్రైవేట్ పాఠశాలపై దాడి
- ఫర్నీచర్ ధ్వంసం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అడవి ఏనుగుల సంచారంతో రైతులు, ప్రజలే కాదు విద్యార్థులకు కూడా భయాందోళన చెందాల్సిన పరిస్థితి వచ్చింది. అడవిలో ఉండాల్సిన ఏనుగులు జనసంచారం లోకి వచ్చి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నిన్న మొన్నటి వరకూ పంట పొలాలు, వ్యవసాయ బోర్లను నాశనం చేసిన అడవి ఏనుగుల గుంపు ఏకంగా పాఠశాలపై దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం చేశాయి. వివరాల్లోకి వెళితే జియ్యమ్మవలస రామినాయుడువలసలో అడవి ఏనుగులు బీభత్సం సృష్టించాయి. గ్రామానికి సమీపంలో ఉన్న శ్రీ సత్యకైలాస్ ప్రైవేట్ పాఠశాలపై బుధవారం రాత్రి దాడి చేశాయి. పాఠశాలలో ఉన్న కిటికీలు, రేకులు, బెంచీలతో పాటు పాఠశాల ఆవరణంలో ఉన్న సరస్వతిదేవి విగ్రహాన్ని ధ్వంసం చేశాయి. రాత్రి వేళ కావడంతో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే అడవి ఏనుగులు రామి నాయుడువలస సమీపంలో ఉన్న చెరువులో తిష్టవేసి ఉన్నాయని, తమ పిల్లలను పాఠశాలకు పంపేందుకు భయపడుతున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు అటవీశాఖ అధికారులకు బుధవారం విన్నవించుకున్నారు. ఆ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించే చర్యలు తీసుకోకపోవడంతో పాఠశాలపై దాడి చేశాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రెండేళ్ల కిందట పెదకుదమలో ఉన్న అంగన్వాడీ కేంద్రంపై దాడి చేసి తలుపులు, కిటికీలు విరగొట్టాయి. నిత్యవసర సరుకులు ధ్వంసం చేశాయి. కొమరాడ మండలంలో కిరాణా షాపుపై దాడి చేసి ధ్వంసం చేశాయి. ఏనుగుల దాడిలో ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతున్నా ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం, అటవీ శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని గిరిజన సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. ఏనుగులను తరలించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఏనుగుల దాడిలో ధ్వంసమైన పాఠశాల

ముస్లిములకు ప్రభుత్వం భరోసా

ఘనంగా పలుచోట్ల ఈద్ మిలాద్ ఉన్ నబీ

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

ముస్లిములకు భరోసాగా ప్రభుత్వం ఉంటుందని టిడ్కో రాష్ట్ర చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ అన్నారు. గురువారం ఈద్ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. ముస్లిం మత పెద్దలు, కుటుంబాలను ప్రత్యేకంగా కలిసి వారికి మీలాద్ ఉన్ నభి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జమ్మాన మాట్లాడుతూ మైనారిటీ కుటుంబాలకు షాధీతోఫా పథకం కింద లక్ష రూపాయల వరకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఘనత వైసిపిదేనన్నారు. కార్యక్రమంలో పట్టణంలోని ప్రధాన మూడు మసీదుల మత పెద్దలు, ముస్లిములు పాల్గొన్నారు.

సాలూరు: ఈద్ మిలాదిన్ నబీ సందర్భంగా ముస్లింలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు స్థానిక జామియా మసీద్ సున్నీ జమాన్ ఆధ్వర్యాన అల్లా భక్తిగీతాలాపనలతో ఊరేగింపు చేశారు. అంతకుముందు మసీద్‌లో ప్రార్థనలు చేశారు.

కురుపాం : ఈద్ మిలాద్ ఉన్ నబీ పండగను పురస్కరించుకొని కురుపాం జామి మసీద్ కమిటీ ముస్లిం మత సభ్యులు, మత గురువు షేక్ సర్దార్ మాలీం ఆధ్వర్యంలో గురువారం శివన్నపేట మసీదు నుండి రావాడ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మత గురువు మాట్లాడుతూ ప్రవక్తలకు పండితుడు మదీనా పట్నానికి మహారాజు దైవ ప్రవక్తను ఎక్కువగా ప్రార్థించే ముస్లింలు మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు వారు మసీదు, ఇళ్ల వద్ద ఆకుపచ్చని జెండాలను ఆవిష్కరించుకొని ఘనంగా ఈద్ మిలాద్ ఉన్ నబీ పండగను జరుపుకుంటారని అన్నారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు షేక్ నిషార్ , షేక్ ఆదిల్, షేక్ జిలాని షేక్ నూరేళ్ల పాల్గొన్నారు.



పార్వతీపురం : పట్టణంలో ర్యాలీ చేస్తున్న ముస్లిములు

నేడు వైఎస్ఆర్ వాహనమిత్ర ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పార్వతీపురం

వైఎస్ఆర్ వాహన మిత్ర ఆర్థిక సహాయ కార్యక్రమం శుక్రవారం జరుగుతుందని జిల్లా రవాణా అధికారి సి మల్లిఖార్జున రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాహన మిత్ర పథకాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విజయవాడలో ప్రారభిస్తున్నారని తెలిపారు. ఈ పథకం కింద 022 - 23 ఆర్థిక సంవత్సరంలో 4564 మందికి రూ.4.56 కోట్లు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని ఆయన వివరించారు. బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ మరమ్మతులు,ఇతర అవసరాలకు సంబంధించిన ఖర్చుల కోసం స్వీయ-యాజమాన్యమైన ఆటో, టాక్సీ, మ్యాక్సీ క్యాబ్, యండియు లకు ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు.

కురుపాం టిడిపిలో తలోదారి

తారాస్థాయికి గ్రూపు రాజకీయాలు


ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం/కురుపాం

మరో ఆరు నెలల్లో సాధారణ ఎన్నికలు రానున్నాయి. ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో కురుపాం నియోజకవర్గంలో మాత్రం గ్రూపుల గోల వీడలేదు. గ్రూపులను ఒకే తాటిపైకి తీసుకొచ్చి పార్టీని సమన్వయంతో నడిపించే నాయకుడే కరువయ్యారు. పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజల్లోకి వెళ్లాలని అధిష్టానం ఆదేశించిన సందర్భాల్లో ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తూ గ్రూపులుగా విడిపోయి కార్యక్రమాలను నిర్వహించడం పరిపాటిగా మారింది. రోజుకొక నాయకుడు తెరపైకి రావడం, ఆశావాహుల సంఖ్య పెరగడంతో కురుపాంలో గ్రూపు రాజకీయాల గోల ఎక్కువైంది. నిన్న మొన్నటి వరకు విజయరామరాజు వర్సెస్ దత్తి లక్ష్మణరావు గ్రూపు రాజకీయాలతో పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. తమ బలాబలాలు చూపించి పార్టీకి పూర్వ వైభం తీసుకువచ్చారు. అంతవరకు బాగానే ఉన్నా గ్రూపు రాజకీయాలు తారాస్థాయికి చేరడంతో ఒకరిపై ఒకరు అధిష్టానానికి ఫిర్యాదుల పర్వం ఎక్కువైంది. గ్రూపు రాజకీయాలు చేస్తున్నారని ఇంఛార్జి అధిష్టానానికి ఫిర్యాదు చేయడంతో గ్రూపులు లేకుండా ఇన్‌ఛార్జితో కలిసి పని చేయాలని దత్తి లక్ష్మణ వర్గానికి అధిష్టానం సూచించింది. అయితే ఆమెతో కలిసి పనిచేసేందుకు దత్తి లక్ష్మణ వర్గం ఆశావాహులు, నాయకులు ససే మేరా అంటున్నారు. అధిష్టానాన్ని కలిసి వచ్చేంత వరకు పార్టీ కార్యక్రమాలు చేయొద్దని కురుపాం పరిశీలికులు దత్తి లక్ష్మణరావు వర్గం సభ్యులకు సూచించినట్టు తెలుస్తోంది. ఈ కారణంగానే గత 15 రోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. కొత్తగా టిడిపిలోకి చేరిన వైరిచర్ల వీరేష్ దేవ్ రెండు గ్రూపుల నాయకులతో కలిసి కట్టుగా పని చేయడం, మరోవైపు చంద్రబాబుకు సంఘీభావం సైకిల్ యాత్ర వంటి వ్యక్తిగత కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న వారిలో వీరేష్‌దేవ్ కూడా ఉన్నారని జోరుగా ప్రచారం జరుగుతుంది. అయితే గ్రూపు రాజకీయాల కారణంగా ముఖ్య నేతలు ఈ సైకిల్ యాత్రకు డుమ్మా కొట్టారు. కురుపాం టిడిపిలో కలుపు పోయే ధోరణి కనిపించడం లేదు. ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న వారు ఎక్కువమంది ఉన్నారే తప్ప రానున్న ఎన్నికల్లో గెలుపునకు ఎటువంటి ప్రయత్నాలు జరగాలి అన్నదానిపై దృష్టి సారించడం లేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇదే కొనసాగితే రానున్న రోజుల్లో టిడిపికి తీవ్రనష్టం తప్పదని హెచ్చరిస్తున్నారు. కురుపాం నియోజకవర్గంపై అధిష్టానం దృష్టి సారించి గ్రూపు రాజకీయాలకు తెర తీసి సమన్వయంతో పనిచేసేలా చొరవ చూపకుంటే భవిష్యత్తులో పార్టీ మనుగడకు ముప్పు తప్పదని పేర్కొంటున్నారు. ఈ మేరకు అధిష్టానం కురుపాం నియోజకవర్గంపై ఏ మేరకు దృష్టి సారిస్తుందో వేచి చూడాల్సిందే.

ఇకెవైసి పరిశీలన

ప్రజాశక్తి- సీతానగరం

ప్రతి రైతూ ఇకెవైసి చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్ అన్నారు. మండలంలోని అందిపేట కోట, సీతారాంపురం గ్రామాలలో జరుగుతున్న ఇకెవైసి నమోదును ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పంట నమోదు చేసుకున్న రైతులంతా తప్పక ఇకెవైసి చేయించుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఈ పంట నమోదు 85 పూర్తయిందని, ఇకెవైసి 66శాతం అయిందని ఈనెల 30తో ఈ పంట నమోదు సమయం ముగుస్తుందన్నారు. ఈ మూడు రోజుల్లో మిగతా 34శాతం పూర్తి చేయాలని ఆయన వ్యవసాయ సిబ్బందికి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఎస్ అవినాష్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



వైసిపి నాయకునికి కేక్ తినిపిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

గడపగడపకూ 200 రోజులు

కేక్ కట్ చేసిన డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 200 రోజుకు చేరుకోవడంతో డిప్యూటీ సిఎం రాజన్నదొర, ఇతర వైసిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. మండలంలోని శంబరలో గురువారం కేక్‌కట్ చేశారు. అనంతరం గ్రామంలో గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి మర్రిపాలమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసనాయుడు, వైసిపి నాయకులు ఎం.రంగు నాయుడు, స్థానిక సర్పంచ్ సింహాచలమమ్మ, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజిలెన్స్ దర్యాప్తు నిర్వహించాలి

ప్రజాశక్తి- పాచిపెంట

జగనన్న కాలనీలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అధికారులతో దర్యాప్తు నిర్వహించాలని పాచిపెంట సచివాలయం-1 కన్వీనర్ మజ్జి వెంకట్రావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరుకై డిప్యూటీ సీఎం పి రాజన్న దొర ఆధ్వర్యంలో 5 ఎకరాల భూమిని కొనుగోలు చేసి లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారన్నారు. ఇళ్ల పట్టాల మంజూరులో గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి తట్టికాయల గౌరీశ్వరరావు తన కుటుంబీకులకు బినామీలకు సుమారు 50 నుండి 60 ఇళ్ల స్థలాలు పట్టాలు ఇప్పించారని ఆరోపించారు. మరలా అవే పట్టాలు బినామీలు వద్ద నుండి తీసుకొని క్రయవిక్రయాలకు పాల్పడి ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడిచాడని ఆరోపించారు. తక్షణమే విజిలెన్స్ అధికారులతో సమగ్ర దర్యాప్తు నిర్వహించి నిజమైన పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రతి ఒక్క విద్యుత్తు వినియోగదారుడు తప్పనిసరిగా ఆధార్ అనుసందానం చేసుకోవాలని ఎఇ డి. బాలాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వ్యవసాయ పంపులు, గృహాలు, తాగునీటి సరఫరా రక్షిత పథకాలు తదితరమైన 22,270 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు 60 శాతం వరకు ఆధార్ అనుసంధానం చేసుకున్నారని, మిగిలిన వారు కూడా త్వరగా ఆధార్ అనుసంధానం చేసుకొని తమకు సహకరించాలని కోరారు.

కాలువల్లో పూడిక తీయాలి

ప్రజాశక్తి - బెలగాం

పార్వతీపురం పట్టణంలోని మెయిన్ రోడ్‌లో ఆక్రమణలు తొలగించి, కాలువుల్లో పూడికతీత పనులు చేపట్టాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జనసేన నాయకులు వంగల దాలినాయుడు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ ఏమాత్రం చినుకుపడిన పట్టణ మెయిన్ రోడ్డు చెరువుగా మారుతోందన్నారు. మెయిన్ రోడ్డులోని మురుగుకాలువలపై ఆక్రమణలు తొలగించి పూడిక తీత పనులు చేపట్టాల్సిందిగా వేసవి నుంచి సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. మెయిన్ రోడ్డుతో పాటు పలు వీధుల్లో మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో దోమలు, ఈగలు పెరిగి వర్షపు నీరు కూడా నిల్వ ఉండి ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పట్టణ మెయిన్ రోడ్డు మురుగు కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించి పూడిక తీత పనులు చేపట్టి వర్షపు నీరు మెయిన్ రోడ్‌లో నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని కోరారు.



శివున్నాయుడి యోగ క్షేమాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

పిఎసిఎస్ చైర్మన్‌కు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని వెంకంపేటకు చెందిన వైసిపి సీనియర్ నాయకులు, పెదబొండపల్లి పిఎసిఎస్ చైర్మన్ తీళ్ళ శివున్నాయుడు ఇటీవల ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలికి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే జోగారావు గురువారం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న శివున్నాయుడుని పరామర్శించారు. అసెంబ్లీ సమావేశాలలో పాల్గొని పార్వతీపురం చేరుకున్న ఆయన వెంటనే అక్కడకు వెళ్లి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బొమ్మి రమేష్, వైస్ చైర్మన్లు సిద్ధ జగన్నాధరావు, బంకురి రవికుమార్, నాయకులు బలగ నాగేశ్వరరావు, మజ్జి శేఖర్, తీళ్ళ చంటి, కార్యకర్తలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ దంపతులను సత్కరిస్తున్న సభ్యులు

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి- సాలూరు

పట్టణానికి చెందిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కెవి సత్యనారాయణ దంపతులను గురువారం పార్వతీపురంలో మంచిపిల్లి శ్రీరాములు ట్రస్ట్, సాలూరు సాహితీ మిత్రబృందం సంయుక్తంగా సత్కరించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కెవి సత్యనారాయణ, సతీమణి నాగమణిలను ఘనంగా సన్మానించారు. ట్రస్టు నిర్వాహకులు మంచిపిల్లి శ్రీరాములు, సాలూరు సాహితీ మిత్ర బృందం వ్యవస్థాపక అధ్యక్షులు జెబి తిరుమలాచార్యులు వారిని దుశ్శాలువాలతో సన్మానించారు.

నేత్ర శస్త్రచికిత్సలకు 36మంది ఎంపిక

ప్రజాశక్తి - పాచిపెంట



మాట్లాడుతున్న వేణుగోపాలరావు

మండలంలోని గురువు నాయుడుపేటలో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 36మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హ్యాండ్ ఇన్ హ్యాండ్, శంకర్ ఫౌండేషన్ వారు సంయుక్తంగా ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎల్మర్ ఒంగ్ జర్మనీ వారి చేతుల మీదుగా ప్రారంభించారు. శిబిరంలో 136 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 36 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేసినట్టు వైద్యులు గుర్తించారు. కార్యక్రమంలో నీడ్ డైరెక్టర్ పాచిపెంట వేణుగోపాలరావు, గొట్టాపు ముత్యాలునాయుడు, ధనుంజయరావు, హ్యాండ్ ఇన్ హ్యాండ్ ప్రతినిధి జయబాబు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుపై గ్రామాల్లో ప్రచారం

ప్రజాశక్తి- సాలూరు రూరల్

దొంగే దొంగా దొంగా అన్నట్లు ఉంది ఈ ప్రభుత్వం తీరు అని టిడిపి నియోజక వర్గ ఇంఛార్జి గుమ్మిడి సంధ్యారాణి ఎద్దేవా చేశారు. మండలంలోని శివరాంపురంలో పార్టీ నాయకులతో కలిసి జలదీక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి చంద్రబాబును ప్రభుత్వం, జగన్ మోహన్ రెడ్డి ఏ విధంగా ఇబ్బందులు చేస్తుందని కరపత్రం ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజు దేవ్, టిడిపి మండల అధ్యక్షుడు ఆముదాల పరమేష్, శ్యామ్, వెంకట రమణ, త్రినాథ్, శ్రీను, భాస్కర రావు, బాలాజీ పాల్గొన్నారు. **కురుపాం:** టిడిపి యువ నాయకులు వైరచర్ల వీరేశ్ చంద్రదేవ్ కురుపాం టిడిపి కార్యాలయం నుండి తోటపల్లి దేవస్థానం వరకూ గురువారం సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ యాత్రకు జనసేన సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కాగా ఈ యాత్రలో టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి టి. జగదీశ్వరి తనతోపాటు తన వర్గంలో ఉన్న నాయకులు ఎవరూ పాల్గొనలేదు. మిగిలిన ఐదుగురు ఆశావాహులు కూడా పాల్గొనకపోవడంతో చర్చనీయాంశమైంది. సైకిల్ యాత్రకు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు నిమ్మక జయరాజు కలిసి సంఘీభావం



సాలూరు: నీటిలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

తెలిపారు. సైకిల్ యాత్ర ముగిసిన తరువాత మండల కన్వీనర్ కెవి కొండయ్య టిడిపి నాయకులు రిలే నిరాహారదీక్ష కొనసాగింది. **సీతానగరం:** మండలంలోని కాశిపేటలో గురువారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. బొబ్బిలి టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబీనాయనా, పార్వతీపురం నియోజకవర్గం ఇంఛార్జి బోనాల విజయ్ చంద్ర మాట్లాడుతూ చంద్రబాబును రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయించి రాక్షస ఆనందం పొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు కె తిరుపతిరావు, ఆర్. వేణుగోపాల్‌నాయుడు, ఎస్. హరిగోపాల్‌రావు, భాస్కరరావు, వి. సూర్యనారాయణ, రామకృష్ణ, టి. చంద్రశేఖర్, డి వెంకట్ నాయుడు, బి లక్ష్మణరావు, పిఎస్ఎన్ఎల్, పి సత్యనారాయణ, బర్నాల సీతారాం పాల్గొన్నారు. **వీరఘట్టం** : టిడిపి మండల అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై కళ్ళకు గంతలు కట్టి మోకాళ్ళపై నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పి నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి సిహెచ్ ఉమామహేశ్వరరావు, నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు పారిచర్ల వెంకటరమణ, మండల తెలుగు యువత అధ్యక్షులు మాచర్ల అనిల్, హరిబాబు, ఏ కుమారస్వామి, అసిరి నాయుడు, రాయిపల్లి రత్నాకర్, ఎన్ నాగభూషణ్, పి.ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.
గరుగుబిల్లి : మండలంలోని సంతోషపురంలో గురువారం సర్పంచ్ అంబటి తవిటి నాయుడు ఆధ్వర్యంలో బాబుతో నేను సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు అక్కన. మధుసూదన్ రావు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **సీతంపేట:** మండలంలోని జక్కరవలస పంచాయతీ పరిధిలో దిగువ దరబా, కరగూడ గ్రామాల్లో ఎస్‌టి సెల్ అధ్యక్షులు బి.చంద్రరావు ఆధ్వర్యంలో గురువారం బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఉప్పర జమ్మిలో టిడిపి నాయకులు పడాల భూదేవి బాబు అరెస్టులో జరిగిన అన్యాయంపై అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సవర కుంపి, సవర సూర్యారావు, కుండంగి రసూల్, బిడ్డిక శ్రీను, కుండంగి నాగేశ్వరరావు, ఆరిక బాలకృష్ణ, మహిళా



కురుపాం: సైకిల్ యాత్ర చేస్తున్న వీరేష్ చంద్రదేవ్

నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టు సాధిస్తున్న టిడిపి మండల అధ్యక్షులు

పాలకొండ : తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గండి రామినాయుడు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీపై పట్టు సాధిస్తున్నారు. రెండేళ్ల క్రితం పార్టీ పదవి దక్కించుకున్న ఆయన మండలంలో పార్టీ పటిష్టమయ్యేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. మండలంలో 32 పంచాయతీల్లో కార్యకర్తలకు ఎటువంటి సమస్య ఎదురైనా తానే ముందుగా వచ్చి వారికి భరోసా ఇస్తున్నారని కార్యకర్తలు చెప్పుకుంటున్నారు. గతంలో జరిగిన స్థానిక సంస్థలకు జరిగిన ఎన్నికల్లో టిడిపి తరపున అంపిలి గ్రామ సర్పంచ్ స్థానానికి పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అధికార పార్టీ దృష్టి అంతా ఆ పంచాయతీ మీదే పెట్టి, కీలక నేతలంతా వ్యూహం పన్నినా కూడా వైసీపీకి వారు అనుకున్నట్లుగా మెజార్టీ రాకుండా చేయడంలో ఆయన సఫలీకృతులయ్యారనే చెప్పొచ్చు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం ఆయన ప్రభావం ఎంత ఉంటుందో చూడాల్సిన పరిస్థితి.

శ్రమదానంతో మరమ్మతులు

ప్రజాశక్తి- సాలూరు రూరల్



పనులు చేస్తున్న రైతులు

రైతులు శ్రమదానంతో గురువారం ఎత్తిపోతల పథకానికి మరమ్మతు పనులు చేపట్టారు. ఇటీవల ప్రజాశక్తి పత్రికలో బురదాలమ్మ ఎత్తిపోతల పథకంపై వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు ఆగమేఘాల మీద ప్రాజెక్టు వద్దకు వచ్చి మరమ్మతు పనులకు కావాల్సిన నిధులపై ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అధికారుల హడావుడి చూసి ఆయకట్టు రైతులు మరమ్మతు పనులు చేస్తారని ఆశపడ్డారు. కానీ మరమ్మతు పనులకు నిధులు లేవని అధికారులు చేతులేత్తేయడంతో ఏమి చేయాలో అర్థం కాక ఆయకట్టు పరిధిలో వుండే రైతులందరూ సమావేశమై ఈ పది రోజులలో మరమ్మతు పనులు చేసుకోకపోతే వ్యవసాయం చూస్తుండగానే నీరు అందక పంట చనిపోయే ప్రమాదం ఉందని భావించారు. ఈ నేపథ్యంలో ఇంటికి ఒక రైతు చొప్పున సువర్ణముఖి నదిలో పంపులు వద్ద వున్న మట్టిని తొలగించి తదుపరి తలో కొంత నగదును పోగుచేసి మోటార్లు, ఎలక్ట్రికల్ బోర్డులను బాగు చేయించారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి దీనికి సంబందించిన ఏ మరమ్మత్తులు వచ్చినా ఖరీఫ్ సీజన్ కు ముందుగానే చేపించాలని రైతులు కోరుతున్నారు

అగ్ని అస్త్రం తయారీపై అవగాహన

ప్రజాశక్తి - బలిజిపేట



అవగాహన కల్పిస్తున్న ఎఒ శ్రావణ్‌కుమార్

మండల కేంద్రమైన బలిజిపేటలో సర్పంచ్ బి.రాగలత ఆధ్వర్యంలో సామూహికంగా అగ్నిస్త్రం రైతులచే తయారు చేయించి, వారే స్వయంగా పొలంలో వరి పంట సాగుకు వాడుతున్నారని ఎఒ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా .తయారీ, వాడే విధానం గురించి ఎంసిఆర్ పి.లక్ష్మి అవగాహన కల్పించారు. పచ్చపురుగు, కాండం తొలిచేపురుగు, కాయతొలుచే పురుగు, కత్తెర పురుగు మొదలగు పెద్దపురుగుల నివారణ కొరకు ఉపయోగించే ఈ అగ్ని అస్త్రం తయారీ కొరకు గోమూత్రం, పచ్చిమిరపకాయలు, వెల్లుల్లి, పొగాకు గుండ, వేపాకులు మరియు తయారైన తర్వాత కషాయాన్ని ఉపయోగించే మోతాదుల గురించి వివరించారు.ఈ సందర్భంగా ఏవో శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కాషాయాల వాడకం వలన రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి నాణ్యమైన దిగుబడులు వస్తున్నాయని అలాగే ప్రజల ఆరోగ్యం కూడా బాగుంటుందని వివరించారు. సర్పంచ్ రాగలత మాట్లాడుతూ ఈ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో మహిళలు పెద్ద ఎత్తున పాలుపంచుకొని కుటుంబ ఆరోగ్యాలతో పాటు ఆర్థిక సాధికారతను సాధించగలరని వివరించారు. కార్యక్రమంలో ఐసిఆర్ పి.తిరుపతిరావు, ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న బండారు సత్యనారాయణమూర్తితో పాటు మహిళా రైతులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్లతో గిరిజనులకు తిప్పలు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయి. ఈ రోడ్లపై ప్రయాణించాలంటే గిరిజనులకు తిప్పలు తప్పడం లేదు. ఇందుకు నిదర్శనం నాగావళి నది ఆవిల ఉన్న పాలెం పంచాయితీకి వెళ్లే రోడ్డు. ఈ రహదారి అధ్వానంగా ఉండడంతో గిరిజనులు రాకపోకలు చేసేందుకు నానా కష్టాలుపడుతున్నారు. పాలెం పంచాయతీ పరిధిలో కుంబికోట, మర్రిగూడ, రావికోన, గొందిలోవ, వాడపుట్టి తదితర సుమారు 10 గ్రామాల ప్రజలకు రోడ్డు సమస్య పట్టిపీడిస్తుంది. ఈ గ్రామాలన్నీ పాలెం మీదుగా రావికోన వరకూ చుట్టు పక్కల ఉండే ఈ గ్రామాలకు రోడ్డు సదుపాయం లేక నానా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సేవల కోసం గర్భిణీలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి 108 సదుపాయం కరువయ్యే పరిస్థితి ఉంది. పాలెంలో సచివాలయం ఉన్నప్పటికీ రోడ్డు సదుపాయం లేక అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



కొమరాడ: అధ్వాన్నంగా తయారైన రహదారి

అధికారుల నిర్లక్ష్యమా రాజకీయ నాయకుల వైఫల్యమా ఆ గ్రామానికి రోడ్డు సదుపాయం కరువైందని బాధిత గ్రామాల గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ నాయకులు ఓట్లు దండుకోవడానికి వస్తారే తప్ప ఆ గ్రామాలను పట్టించుకొనే నాధుడే కరువైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి ఆ గ్రామానికి కనీస సౌకర్యాలు కల్పించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

చినుకు పడితే చిత్తడే..

సాలూరు రూరల్: మండలంలోని యారగడ వలస, మావుడీ గ్రామాల మధ్యలో నిత్యం అరటి, పామాయిల్ పట్టుకు వెళ్ళే లారీలు పదుల సంఖ్యలో తిరుగుతుంటాయి. ఈ మధ్యలో రాధిక వెజిటిబుల పామాయిల్ వే బ్రిడ్జి కూడా వుండటంతో చాలా రద్దీగా ఉంటుంది. అటువంటి రోడ్ వర్షం పడితే మొత్తం గుంతలు ఏర్పడి పాదచారులు ద్విచక్రవాహనదారులు నడక యాతన పడుతున్నారు. మరమ్మతుకు గురైన రోడ్డును బాగుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



యారగడవలస, మావుడి రోడ్డు పరిస్థితి

పశువులకు వచ్చే వ్యాధులపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై పాడి రైతులు అవగాహనా కలిగి ఉండాలని స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ పి.లక్ష్మణరావు అన్నారు. మండలంలోని పి.ఆమిటి పంచాయతీ వంజరాపుగూడలో వైఎస్ఆర్ పశు విజ్ఞాన పాడి కార్యక్రమంలో భాగంగా పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువుల గర్భ కోశ వ్యాధులకు, ఆడ పెయ్యలకు బ్రుసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు చేశారు. అలాగే వర్షాకాలం వచ్చే జబ్బవాపు, గొంతువాపు, ముద్ద చర్మ వ్యాధులకు, గొర్రెలు, మేకలకు వచ్చే చిటుకు వ్యాధి, మూతుపుండ్లు, మునరా వ్యాధులకు టీకాలు వేశారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. అలాగే వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్య సేవలు గురించి పాడి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు కె.మణికంటేశ్వరి, నిమ్మక శరత్, ఆరిక పవన్, సీమల గణేష్ ఉన్నారు.

విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పిఎం విశ్వకర్మ పథకానికి అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు కొమ్మనాబిల్లి గౌరీశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో వివిధ వర్గాల వారితో విశ్వకర్మ పథకం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకానికి సాంప్రదాయ చేతివృత్తుల, కులవృత్తుల వారైన వండ్రంగి, స్వర్ణకార, కంచర, కుమ్మరి, భవన నిర్మాణ కార్మికులు, చేనేత, మంగలి, చెప్పులు కుట్టేవారు అర్హులన్నారు. ఈ పథకంలో భాగంగా నైపుణ్య శిక్షణతో పాటు రూ.15వేలు విలువచేసే సామగ్రి పంపిణీ చేస్తారని, అవసరమైన అర్హులకు రెండు విడతల్లో రూ.3లక్షలు లోన్ పొందే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో విడతల వారీగా నమోదు ప్రక్రియ జరుగుతుందని, మరికొద్ది రోజుల్లో మన్యం జిల్లాలో నమోదు ప్రారంభం



మాట్లాడుతున్న గౌరీశ్వరరావు

కాబోతుందన్నారు. ముందస్తుగా అవసరమైన ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకుని ఆర్థికాభివృద్ధిని సాధించాలన్నారు. కార్యక్రమంలో కె.సత్యనారాయణ, ఎం.భద్రయ్య, కోదండ, నాగు, చిన్నారి, రామారావు, గ్రంధి సాయి, టైలర్లు, మేస్త్రులు పాల్గొన్నారు.

యువజన సంఘం సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్



కానిస్టేబుల్ కృష్ణమూర్తిని సత్కరిస్తున్న టిడిపి, జనసేన నాయకులు

నిరాశ్రయులకు, పేద వృద్ధులకు, విద్యార్థులకు మీరు చేస్తున్న సేవలు ఎనలేనివి టిడిపి, జనసేన నాయకులు అన్నారు. స్వాతంత్ర సమరయోధుడు భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకొని గురువారం స్థానిక పాత బస్టాండ్ కూడలి వద్ద ఉన్న భగత్ సింగ్ విగ్రహం వద్ద భగత్ సింగ్ యువజన సేవ సంఘం అధ్యక్షులు చిట్టు గణేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా, వృద్ధ మిత్ర కోఆర్డినేటర్ గా విధులు నిర్వహిస్తున్న కె.కృష్ణమూర్తి చేస్తున్న సమాజ సేవలను గుర్తించి పుష్పగుచ్చాలను అందించి, దుస్సాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి పాలూరి బాబు, పట్టణ టిడిపి సీనియర్ నాయకులు మజ్జి కృష్ణమోహన్, జనసేన పార్వతీపురం మండల అధ్యక్షులు ఆగూరు మణి, నియోజకవర్గ నాయకులు అక్కివరపు మోహన్‌రావు, రాష్ట్ర ఐటి వింగ్ కో ఆర్డినేటర్ గేదెల సతీష్, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి - భామిని



సర్టిఫికెట్లు చూపుతున్న మహిళలు

మహిళల ఆరోగ్య పరిరక్షణకు, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి చేయి చేయి కలపాలని హోలీక్రాస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ అన్నారు. ఆ సంస్థ ద్వారా భామినిలో నడుపుతున్న ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రంలో మూడు నెలల శిక్షణ ముగించుకున్న 30 మంది బాలికలు, మహిళలకు గురువారం ఆయన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. శిక్షణా సమయంలో నేర్పించిన పర్యావరణ అనుకూల క్లాత్ ప్యాడ్ తయారీ, ఈ ప్యాడ్‌లను ఉపయోగిస్తూ, పది మందికి పరిచయం చేస్తూ, మహిళల ఆరోగ్యం పరిరక్షణకు, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. త్వరలో నూతన బ్యాచ్ ప్రాంభిస్తామన్నారు. ఈ శిక్షణా కేంద్రంలో చేరాలనుకునే వారు 9441319942 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్త శ్రీవిద్య, బోధకరాలు మీనా పాల్గొన్నారు.

30న జిల్లాలో జెవివి బృందం పర్యటన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 30న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర బృందం జిల్లాలో పర్యటిస్తుందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు పి.రంజిత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 30న గుమ్మలక్ష్మీ పురం, కురుపాం, సాయంత్రం పార్వతీపురం జిల్లా కేంద్రంలో పర్యటన ఉంటుందని తెలిపారు. ఈ బందం లో జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మంజూర్ బాషా తదితరులు ఉంటారని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకు వేదిక బృందం పర్యటిస్తుందని రంజిత్ కుమార్ పేర్కొన్నారు.

సీతాఫలం..పోషకాల నిలయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సీతాఫలం ఏజెన్సీలో దొరికే పండు. ఇప్పుడు ఎక్కడ చూసినా సీతాఫలాలే కనిపిస్తాయి. బుట్టలో రోడ్డు పక్కన పెట్టి అమ్ముతుంటారు. కొండలపై నుంచి వాటిని తీసుకొచ్చి మండల కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. సీతాఫలాన్ని తిని మధురమైన అనుభూతి అనుభవిస్తేనే తెలుస్తుంది ఆ తీపి. సీతాఫలం ఎంతో మధురంగా ఉండటం మాత్రమే కాదు. దాంట్లో ఎన్నో పోషకాలు ఉంటాయి. అందుకే సీతాఫలం తింటే అటు పోషకాలు అందుతాయి. గిరిజనులకు మాత్రం సరైన గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారు.

ఆరోగ్య ప్రదాయిని సీతాఫలం

గుమ్మలక్ష్మీపురం, కురుపాం, సీతంపేట మన్యంలో సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు విస్తారంగా లభిస్తుంది. సీతాఫలం బాగా మగ్గి పండుగా మారాక తినాలి.

గిట్టుబాటు ధరలేక గిరిజనం అవస్థలు



సీతాఫలాలను అమ్ముతున్న మహిళ

సీజన్లో రోజూ తిన్నా ఎటువంటి నష్టం లేదని పోషకాహార నిపుణులు పేర్కొంటున్నారు. తీయని గుజ్జుతో నోరూరించే మధుర ఫలం. దీన్ని పేదోడి ఆపిల్ అంటారు. మామిడి ఇతర పండ్లు మాదిరిగా మగ్గబెట్టడానికి ప్రత్యేక పద్ధతులు అనుసరించాల్సిన అవసరం లేదు. కోసిన కాయలు రెండు, మూడు రోజుల్లో పండుగ మారతాయి. మాంసకృత్తులు, పీచు పదార్థం, ఖనిజ లవణాలు పుష్కలంగా లభిస్తాయి. ఇవి తరచూ తినడం వల్ల జీర్ణ క్రియ మెరుగుపడుతుంది. సీతాఫలంలో అస్సలు కొవ్వు ఉండదు. సాధారణ సైజులో ఉన్న ఒక సీతాఫలాన్ని తింటే దాదాపు 200 క్యాలరీల వరకు శక్తి వస్తుంది. పండులో 4 శాతం ఐరన్, 2శాతం కాల్షియం, విటమిన్ సి 50శాతం, కార్బో హైడ్రేట్లు 48 గ్రాములు, ఫైబర్ 6 గ్రాములు అందుతాయి. అంటే ఇన్ స్టాంట్ ఎనర్జీ లాగా అన్నమాట. ఎప్పుడైనా నీరసంగా ఉన్న, శక్తి నశించిన వెంటనే ఓ సీతాఫలం పండు తింటే చాలు శరీరానికి కావలసిన శక్తి లభిస్తుంది. 100 కాయలు ధర రూ.150 నుంచి రూ.200 పలుకుతుంది.

టిడిపిలో పలు కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని తాడికొండ పంచాయతీ కొండశిఖర గిరిజన గ్రామమైన కప్పకల్లులో 50 గిరిజన కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలోకి చేరాయి. కురుపాం నియోజకవర్గం ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పాడి సుదర్శన్‌రావు, కన్వీనర్ పోలూరి శ్రీనివాసరావు, ఎస్టీ సెల్ అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి కృష్ణబాబు, కురుపాం నియోజకవర్గ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అడ్డాకుల నరేష్, నాయకులు కామేష్, జయంతు జమ్మయ్య, జానకి, ఆరుద్రమ్మ, రామారావు ఉన్నారు.